స్త్రీలహక్కుల విమర్శ:

# కవీ కవిభార్య

శ్రీమతి మోచర్ల సుబ్బలక్ష్మి

నవీన పద్ధతిగా అలంకరించిన ఆఫీస్‌రూమ్. దేశ నాయకుల చిత్రపటాలు. శివపార్వతీ, సీతారాములు. మొదలైనదైవపటాలు ఓ టేబులూ ఫ్లవర్‌వేజ్, రేడియో. నాలుగు కుర్చీలువున్న ఆగది ఆకర్షణీయంగా వుంటుంది. కవిగారు కుషన్ కుర్చీలో కూర్చుని సిగరెట్ కాలుస్తూ బెర్నార్డుషా, చదువుతో వుంటారు. సమయం రాత్రి ఏడు గంటలు. కవిభార్య క్లబ్బునుంచి అప్పుడే వస్తుంది.

కవి: మీటింగునుంచి ఇదేనా రావడం టైము ఎంత అయిందో గమనించావా?

కవిభార్య: నేను ఇంట్లోంచి ఎన్ని గంటలకు వెళ్ళేనో మీరు గమనించారా?

కవి: అదికూడా నీవే చెప్పు.

భార్య: మీరు చెయ్యమన్న కందిపచ్చడి వంకాయ పులుసు పచ్చడీ అరటికాయ వేపుడూ. చారు వగైరాలతో వంటపూర్తి చేసుకొని ఐదుగంటలకు వెళ్ళాను. ఇప్పుడు ఏడు గంటలైనది.

కవి: ఏం? నువ్వు వెళ్ళకపోతే అక్కడ మీటింగు ఆగిపోతుందా?

భార్య! ఆ ఆగే పోతుంది ఉపన్యాసకురాలిని నేనే.

కవి: మొగుడూ పిల్లలూ, సంసారముకంటెమీకు మీటింగులూ ఉపన్యాసాలు ఎక్కువ ముఖ్యమా? మంచి బాగా తయారయ్యావు భయం భక్తి లేకుండగా,

భార్య: అసలు మీటింగులూ ఉపన్యాసాలు ఎవరు అలవాటుచేశారో? నాకునలుగురిలో మాట్లాడటమంటేనే భయం. అటు వంటిది వాదోప వాదాలు, రచనలు, సభలూ, నిత్య కృత్యాలయ్యాయి.

కవి: ఆ నేనే నేర్పానంటావు నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అని ఇప్పుడిల్లా హింసిస్తున్నావు.

భార్య: హింసా. దౌర్జన్యం. ఏముంది ఇందులో మీరు వెళ్ళద్దంటే మానేయటానికే ప్రయత్నిస్తాను,

కవి: ఇంతకీ ఏమి ఉపన్యసించావో శలవిచ్చావు కాదు

భార్య! మీరు చెప్పనిస్తేకదా? ఒచ్చినప్పటినుంచీ ఒక్కమ్మని సాధించి విసిగిస్తున్నారు. స్త్రీలకు ఆస్థి హక్కులవల్ల లాభమా? నష్టమా, ఆస్థి హక్కులు వుండాలా? అక్కరలేదా అని, స్త్రీలకు పురుషులతోబాటు తల్లి దండ్రుల ఆస్థిలో సమాన హక్కులు వుండాలనే నా అభిప్రాయం. అదే చెప్పేను,

కవి: వట్టి మట్టి బుఱ్ఱనీది. స్త్రీ ఆస్థి హక్కుల చట్టంవల్ల నీకు ఎంత ఆస్థి వస్తుంది. నీ పుట్టింటినుంచి.

భార్య: నాకేం వస్తుంది మావాళ్ళకు ఆస్థిలేదని మీరు ఎరుగరా? వ్యక్తిగత విషయంకాదు నేననేద.

కవి: ఆస్థి రాకపోతే మానె యీ చట్టంవల్ల నీకుదారుణమైన నష్టం వస్తుంది గమనించావా?

భార్య: ఏమిటానష్టం?

కవి: యం. ఏ. ప్యాసై కవిత్వపు వెఱ్ఱిలోపడి, అట్టే సంపాదన లేకుండానే నిలాకూర్చుంటే నీక్లబ్బులూ, సినిమాలు. టిష్యూ చీరలూ, రచనలూ, పిక్నిక్కులూ, ఎల్లా జరుగుతోన్నాయనుకున్నావు? నలభై ఎకరముల ఆస్థి వల్లేకదా? స్త్రీ ఆస్థి హక్కుల చట్టం అమలులోకి వచ్చిననాడు నా అప్పచెల్లెండ్రు మన ఆస్థిలో చాలా భాగం పట్టుకుపోరా? నీకు ముష్టి చెంబు చేతికిరాదా? విద్య తక్కువ విజ్రుంభణ ఎక్కువ సర్వజ్ఞత్వంబలిసి పోతోంది నీకు.

భార్య: అయిందా ఉపన్యాసం. ఆహాహా ఏమి అభ్యుదయ కవులండీ మొత్తంమీద దేశ మహిళలందరికీ ఉపయుక్తంగా వర్తించే శాసనాన్ని. వ్యక్తిగత ఉపయోగం కోసం మంచిది కాదని వాదిస్తున్నారు. మీ అప్పచెల్లెండ్రు ఆస్థి అంతా తీసుకున్నా నాకేం భయంలేదు. మీ సంపాదనే మితంగా వాడుకుందాము. అవసరమైతే నేనుకూడా ఉద్యోగం సంపాదించగలను, నిర్వహించగలను మరీ పాతకాలపు కబుర్లు చెప్పకండి.

కవి: బాగానే ఉన్నాయి ఉద్దేశాలు. ఉద్ధేశాలు ఊళ్ళేలుతోంటే బుద్ధి ఇల్లు కదలదుట. పొమ్మన్నా చేసినా మానినా పొమ్మన్నా వుంటానన్నావు అంతేవాలు, కడుపులో ఎలుకలు ఎముకల్ని కరకరా కొరికి గబగబా మింగేద్దామని చూస్తున్నాయి. అన్నంపెట్టే ఉద్దేశం ఏమైనావుందా?

భార్య: ఆ వడ్డిస్తా కాళ్ళుకడుక్కోండి. హరీ, సుబ్బులూ, కాసులూ, గోపాల్‌రండఱ్ఱా భోజనాలుచేద్దాం, రోజూకన్న యీవేళ కాస్త పొద్దు పోయింది. ★